సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం ၊ 25 ၊ ఫిబ్రవరి ၊ 2025



ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. - 8లో



ఏటీఎం నమూనా సాగు.. రాబడి బాగు

ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో పలు రకాల ఆకుకూరలు, కూరగాయలను సాగు చేసి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 75 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేటినుంచి వైఎస్సార్ జిల్లాలో వైఎస్ జగన్ పర్యటన



పులివెందుల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 25, 26వ తేదీల్లో వైఎస్సార్ జిల్లా పులివెందులలో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటలకు గన్నవరం నుంచి హెలీకాప్టర్ ద్వారా బయలుదేరి 11.45గంటలకు పులివెందులలోని భాకరాపురం హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారన్నారు. అక్కడ నుంచి 11.55గంటలకు భాకరాపురంలోని తన నివాసానికి రోడ్డు మార్గాన చేరుకుంటారన్నారు. 12గంటల నుంచి భాకరాపురంలోని తన నివాసంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. మంగళవారం రాత్రి తన నివాసంలో బస చేస్తారు. ఈనెల 26వ తేదీన బుధవారం ఉదయం 9.50గంటలకు మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల పట్టణంలోని గుంత బజార్‌లో వైఎస్సార్ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన వైఎస్ రాజారెడ్డి ఐ సెంటర్‌కు చేరుకుని ప్రారంభిస్తారు. 10.45గంటలకు అక్కడ నుంచి బయలుదేరి భాకరాపురంలోని హెలీప్యాడ్‌కు బయలుదేరుతారు. 11గంటలకు భాకరాపురం హెలీప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఇద్దరు వీఆర్‌ఓలు సరెండర్

బి.కొత్తకోట : విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించడమే కాకుండా సరైన తీరులో స్పందించడంలో విఫలమైన ఇద్దరు వీఆర్‌ఓలను సరెండర్ చేస్తూ రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని గుమ్మసముద్రంలో వీఆర్‌ఓగా పనిచేస్తున్న కోటిరెడ్డి ఇటీవల గండువారిపల్లిలో నెలకొన్న భూ సమస్యలపై సరైన రీతిలో స్పందించి రైతులకు అవగాహన కల్పించలేకపోయారు. పలు రెవెన్యూ అంశాలపై సరైన స్పందన లేకపోవడం గుర్తించి మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు సరెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కోటావూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఓ వరదరాజులు విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై అధికారులు పలుమార్లు హెచ్చరించారు. ఈ గ్రామ పరిధిలోనే పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఉంది. ఈ గ్రామానికి పనిచేసే వీఆర్‌ఓ చురుగ్గా వ్యవహరించాలి. అయితే అధికారుల ఆదేశాలపై నిర్లక్ష్యం, ఫోన్‌కు అందుబాటులో లేకపోవడం, సమస్యలపై సత్వరమే స్పందించకపోవడంతో అధికారులు ఈయన్ను కూడా మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు సరెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్ సోమవారం మాట్లాడుతూ వారిని సరెండ్ చేయడం జరిగిందని, రెండు గ్రామాలకు కొత్త వీఆర్‌ఓలను నియమిస్తామని చెప్పారు.

ఏసీబీ వలకు చిక్కిన జౌళిశాఖ అధికారి



ఏసీబీకి పట్టుబడిన కృష్ణయ్య

రాయచోటి : లంచం తీసుకుంటూ అన్నమయ్య జిల్లా జౌళి శాఖ అధికారి కృష్ణయ్య ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. సోమవారం తంబళ్లపల్లెకు చెందిన లబ్ధిదారుల నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ విజయకుమారి ఆదేశాలతో కడప ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, సీఐలు కృష్ణయ్య కార్యాలయంపై దాడి చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. కృష్ణయ్యపై అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టుకు హాజరుపరుస్తామని వారు తెలియజేశారు.

వైవీయూ చెంతకే ఏఎఫ్‌యూ!

కడప ఎడ్యుకేషన్ : కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ మరి కొద్దిరోజుల్లో వైవీయూ చెంతకు చేరనుంది. 2020లో గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో తాత్కాలిక భవనాల్లో ప్రారంభమైన వర్సిటీ భవనాల లీజు గడువు 2024 డిసెంబర్‌తో ముగిసింది. కాగా దీనిపై తదుపరి నిర్ణయం తీసుకోవాలంటూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సులర్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కాగా సోమవారం ఉన్నత విద్యాధికారుల నుంచి వైవీయూ, ఏఎఫ్‌యూ అధికారులకు లేఖ అందింది. ప్రస్తుత ఆర్కిటెక్చర్ విశ్వ విద్యాలయాన్ని వైవీయూ ప్రాంగణంలోని గురుకులం భవనాల్లో నిర్వహించుకునేందుకు అనుమతించాలంటూ లేఖలో పేర్కొన్నారు. విశ్వ విద్యాలయ శాశ్వత భవనాలు నిర్మాణం పూర్తయ్యి.. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఏఎఫ్‌యూను వైవీయూ గురుకుల భవనంలోనే నిర్వహించాలని సూచించారు.

అధికారబలం.. సామాన్యుడి శోకం

- కూటమి సర్కార్ ఏర్పడిన తర్వాత బరి తెగిస్తున్న నేతలు
- ఎక్కడికక్కడ సాగుతున్న దాడులు, దౌర్జన్యాలు, ఆక్రమణలు
- భరించలేక కలెక్టరేట్‌కు క్యూ కడుతున్న బాధితులు



మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దమ్మలపాటి రమేష్ దొంగ పట్టా తీసుకుని భూమిని ఆక్రమించుకుంటున్నాడంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

సాక్షి రాయచోటి : అధికారం అండగా..ఆగడాలు మెండుగా జిల్లాలో కొనసాగుతున్నాయి. భూ ఆక్రమణలు, దందాలు, కబ్జాలు, దౌర్జన్యాలకు కొదవ లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడ చూసినా నేతలు ఆడిందే ఆటగా ముందుకు సాగుతున్నారు. ఆర్థికంగా బలోపేతం కావడం కోసం కొందరు అక్రమ మార్గాన్ని, మరికొందరు దౌర్జన్య మార్గాన్ని ఎంచుకున్నారు. ఇప్పటికే ఇసుక, మద్యం, మట్టి, రాళ్లు, భూములు ఇలా అవకాశం ఉన్న ప్రతి దానిపై కన్నేస్తున్నారు. కూటమిలో నేతలు కొందరు ఇలా అక్రమ మార్గాలవైపు వెళితే...గత ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చకపోవడంతో పలు వ్యవస్థలు నినదిస్తున్నాయి. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ నిర్వహించే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వచ్చి గోడు వెళ్లబోసుకునేందుకు బారులు తీరుతున్నారు.

మదనపల్లె మాజీ ఎమ్మెల్యే రమేష్ భూభాగోతం

మదనపల్లెకు చెందిన టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ సర్వే నంబర్ 423–2లో పట్టాలిచ్చిన భూమిని కబ్జా చేస్తున్నారని బాధితులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన సుమారు 77 మంది ప్రత్యేక వాహనాల్లో రాయచోటికి వచ్చి కలెక్టర్ వద్ద మొర పెట్టుకున్నారు. మదనపల్లె మండలం బండమీద కమ్మపల్లె సమీపంలో సెర్పికల్చర్ కాలనీ పరిధిలోని భూమిలో తాము కొన్నేళ్ల కిందట ఒక కుటుంబం నుంచి కొనుగోలు చేసి లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేశామని వెల్లడించారు. అయితే ఇప్పుడు అదే కుటుంబం నుంచి టీడీపీ నేత రిజిష్టర్ చేయించుకుని అక్రమ మార్గంలో తమ స్థలాలను లాగేసుకునేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కష్టపడి ఇల్లు కట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా ప్రహరీ నిర్మించడం ఏమిటని వారు నిలదీస్తున్నారు.

ఇప్పటికే మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్‌బాషను సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌తోపాటు ఎస్పీని కలిసినట్లు వారు వెల్లడించారు. చేనేత కార్మికులమైన తమకు ఉన్న స్థలాలను టీడీపీ నేత దౌర్జన్యంగా తీసుకోకుండా తమకే కేటాయించాలే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంగా న్యాయం జరగకపోతే ఇతర ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు వారు వెల్లడించారు.

హామీలు అమలు చేయాలి

జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు కలెక్టరేట్‌కు చేరుకుని నినాదాలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాల్సిన ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికులు కలెక్టరేట్ వద్ద హోరెత్తించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

కూటమి సర్కార్ తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఏపీ 108 అంబులెన్స్ ఉద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు వారు సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు చేరుకుని తమ ఆవేదన వ్యక్తం చేశారు. 108 అంబులెన్స్ సర్వీసులో తాము నిస్వార్థమైనటువంటి నిబద్ధతతో కూడిన విధులు నిర్వహిస్తున్నామన్నారు. 108 ఉద్యోగుల సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి అదనంగా నెలకు మరో 4వేల రూపాయలు ప్రకటించినా ఇప్పటికే ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితోపాటు వాహనాల విషయంగా కూడా ఇబ్బందులు తప్పడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని వారు కోరారు.

➡ కురబలకోటలోనూ ఇదే తంతు



అంగళ్లు వద్ద మా ప్లాట్లను ఆక్రమిస్తున్నారని కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన బాధితులు

తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం అంగళ్లులో ఇదే తంతు కొనసాగుతోంది. 220/4 సర్వే నంబర్‌లో 2016–20 మధ్య సుమారు 70 మందికి పైగా ప్లాట్లు కొనుగోలు చేస్తే ఇప్పుడు ఒక్కొక్కరు ఒక్కసారి వచ్చి బెదిరిస్తున్నారు. విలువైన స్థలాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం కావడంతో అధికార పార్టీ నేతల కన్ను పేదల పట్టాలపై పడింది. కొంతమంది నేతలు పట్టాలకు సంబంధించిన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారు. అక్కడి స్థలానికి సంబంధించి సుమారు అధికార పార్టీకి చెందిన అనంతపురం, మదనపల్లెకు చెందిన ముగ్గురు నేతలు పట్టాల స్థలంలోకి రాకుండా అడ్డుకుంటున్నారు. దీంతో కురబలకోటనుంచి ప్రత్యేక వాహనాల్లో వచ్చి కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అధికార పార్టీ నేతల నుంచి తమ స్థలాలను రక్షించి న్యాయం చేయాలని బాధితుడు కలెక్టర్‌ను వేడుకున్నారు.

▶▶ కాలువపల్లె పాఠశాలను తరలించవద్దని గ్రామస్తుల నిరసన

జిల్లాలోని ములకలచెరువు మండలం కాలువపల్లెలోని పాఠశాలను తరలించకుండా స్థానికంగా ఉండేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రస్తుతం ఎంపీయూపీఎస్ పాఠశాలలో 143 మంది పిల్లలు ఉండగా, అందులోని 6, 7, 8 తరగతుల్లో 53 మంది, 5వ తరగతిలో 22 మంది పిల్లలు చదువుతున్నారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతికి వచ్చేసరికి 6, 7, 8, 9 తరగతుల్లో 73 మంది పిల్లలు అవుతారు. ఈ



పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని...రేషనలైజేషన్‌లో భాగంగా మార్పు చేస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని అక్కడి విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. సుమారు 30–40 మంది విద్యార్థుల తల్లిదండ్రులు వచ్చి మా దగ్గరలో 8 కిలోమీటర్ల వరకు హైస్కూలు లేదని,ఈ పాఠశాలలోనే ఎక్కువ మంది ఆడపిల్లలు చదువుతున్నారని, మైనార్టీ వర్గాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారని....దూర ప్రాంతానికి పాఠశాలను మారిస్తే అంతదూరం విద్యార్థులను పంపించాలన్నా కష్టమని వారు విన్నవించారు. ఈ పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించాలని కోరారు.

కమనీయం..రాచరాయుడి కల్యాణం



మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి(రాచరాయుడు) బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండవ రోజైన సోమవారం స్వామివారి కల్యాణం అత్యంత కమనీయంగా సాగింది. స్వామివారి కల్యాణానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. వీటిని స్వామి , అమ్మవారికి సమర్పించి తరువాత కల్యాణ వేదికపైకి తీసుకొచ్చారు. అనంతరం వేదపండితులు నర్రా వెంకట భాస్కర్‌రెడ్డి (ప్రణవానందగిరి) శిష్యులు మఠం ఓంకార స్వామి ఆచారత్వాన కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలివచ్చారు. వీరికి తలంబ్రాలు, ముత్యాలు అందజేశారు. భక్తులకు మన్నూరు రాజశేఖర్, ఆయన భార్య విజయ కుమారి ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈవో డీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, రాచరాయ యోగీ స్వామి పాల్గొన్నారు.



పల్లకీలో ఊరేగుతున్న స్వామి,అమ్మవారు

మనోహరంగా మయూర వాహన సేవ

శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారు సతీ సమేతంగా మయూర వాహనంపై ఊరేగారు.భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : అన్నమయ్య జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే నవోదయం 2.0 కార్యక్రమం లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నవోదయం 2.0 కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను కలెక్టర్ శ్రీధర్ ఆవిష్కరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా అమ్మకాలపై ఫిర్యాదులను కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు. 14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రమాదేవి, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్,ఎక్సైజ్ అధికారి మధుసూదన్ తదితరులు

మార్చి 1 నుంచి జాతీయ పశు వ్యాధి నివారణ టీకాలు

రాయచోటి : మార్చి 1వ తేదీ నుంచి 30వ తేది వరకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ పశువ్యాధి నివారణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధికి, బ్రూస్ ఎల్లోసిస్ వ్యాధులకు అవసరమైన 3,31,300 టీకా పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో పశు సంవర్ధకశాఖ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయించుకోవడం నిషిద్ధం

రాయచోటి జగదాంబసెంటర్ :14 సంవత్సరాలలోపు బాల కార్మికులతో పనిచేయించుకోవడం పూర్తిగా నిషేధమని, బాల కార్మికుల గురించి ఫిర్యాదు కోసం 1098 నంబర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో బాల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం–1986పై .జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి రంగరాజు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమీల, డీఈఓ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పీ–4 సర్వేలో జరుగుతున్న పురోగతిని కొనసాగించాలి

రాయచోటి టౌన్ : పేదరిక నిర్మూలన -పీ- 4 సర్వేలో జరుగుతున్న పురోగతిని కొనసాగించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక పిరమిడ్‌లోని ఉన్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది.. దిగువన ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకొని పేదరికం నిర్మూలించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.

శంకర.. శుభంకర



ప్రత్యేక అలంకరణలో శ్రీత్రేతేశ్వరుడు

అభిషేకప్రియుడైన ఆ పరమేశ్వరుడిని ప్రసన్నం చేసుకునేందుకు.. ఆదిబిక్షువు సేవలో తరించేందుకు జిల్లాలోని శైవక్షేత్రాలు సన్నద్ధమయ్యాయి. మరో రెండురోజుల్లో రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక శోభతో కళకళలాడుతున్నాయి. హరహర శంకర..శంబో శంకరా అంటూ మంత్రోచ్చారణలు మార్మోగుతున్నాయి. అశేష భక్తజనం జంగమయ్య దర్శనానికి ఆలయాలబాట పట్టారు.



విద్యుత్ వెలుగులతో విరాజిల్లుతున్న అత్తిరాలలోని త్రేతేశ్వర ఆలయం



శ్రీనిత్యపూజ స్వామి మూల విరాట్

రాజంపేట రూరల్ : జిల్లాలో ఎంతో ప్రసిద్ధిగాంచిన అత్తిరాల త్రేతేశ్వర ఆలయానికి శివరాత్రి రోజు లక్షలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని ఆలయంలో రాత్రి నిద్రించి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. త్రేతాయుగంలో స్వయంభుగా వెలసిన శివలింగం కావడం ఈ ఆలయం ప్రత్యేకత. ఇక్కడి స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు హరించుకుపోతాయని భక్తుల నమ్మకం. స్వామి దర్శనానికి ముందు బాహుదానదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి భక్తులు మక్కువ చూపుతారు. ఆలయంలో పరుశురాముడు ప్రత్యేకంగా పూజలు చేసినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. తండ్రి ఆజ్ఞ మేరకు తల్లిని వధిస్తాడు పరుశురాముడు. ఎన్ని పుణ్యస్నానాలు ఆచరించినా, ఎన్ని దేవాలయాలు తిరిగినా తల్లిని హత్యచేసిన ఆనవాళ్లు అతడి శరీరంపై అలాగే ఉంటాయి. ఈ క్రమంలో అత్తిరాల ఆలయానికి చేరుకుని బాహుదానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన వెంటనే మాతృహత్య ఆనవాళ్లు కనుమరుగైపోతాయి. దీంతో అత్తిరాలగా ఉన్న పేరుకాస్త హత్యరాలగా మారిందని చరిత్ర చెబుతోంది. ఇక్కడ జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో 26, 27, 28 తేదీలు చాలా ప్రధానమైనవి. 26న మహాశివరాత్రి, 27న కల్యాణం, 28న రథోత్సవం నిర్వహిస్తారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.రాజంపేట ఆర్టీసీ డిపో నుంచి అత్తిరాలకు ప్రతి పది నిమిషాలకు ఒక బస్సును నడపనుంది. బహుదానది తీరం వెంబడి బారికేడ్లను, భక్తులు స్నానం చేసేందుకు స్నాన ఘట్టాలను ఏర్పాటు చేశారు.సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, తాసిల్దార్ పీర్ మున్ని ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఏఎస్పీ మనోజ్‌కుమార్ హెగ్డే, పర్యవేక్షణలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

భక్తుల కొంగుబంగారం నిత్యపూజ స్వామి

సిద్దవటం: శ్రీ లంకమల్ల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజస్వామి ఆలయం భక్తుల కొంగుబంగారంగా బాసిల్లుతోంది. సిద్దవటం మండలం లోని వంతాటిపల్లె గ్రామానికి 13 కిలోమీటర్ల దూరంలోని లంకమల్ల అభయారణ్యంలో 600 సంవత్సరాల కిందట ఉద్భవలింగం వెలసినట్లు ప్రచారం. ఈ ఉద్భవ లింగానికి ప్రతి నిత్యం సమీప కొలనులో అక్కదేవతలు స్నానాలు చేసి పవిత్రంగా పూజలు నిర్వహించేవారని ప్రతీతి. మహా శివరాత్రి పర్వదినాన , కార్తీక మాసాల్లో నిత్యం స్వామికి పూజలు జరుగుతాయి. ఈ పూజలు జరిగిన మరుసటి రోజే మూలపల్లె గ్రామంలో అయ్యవారురెడ్డి స్వామి తిరునాల నిర్వహించాలని భోదించినట్లు స్థానికుల నమ్మకం. ఈ విధంగా నిత్యపూజ స్వామి వద్దకు వెళ్లే భక్తులు మొదట పంచలింగాల స్వామికి పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ చెన్నకేశవ స్వామి ఆలయం, అక్కదేవతల విగ్రహాలకు పూజలు చేస్తారు. ఇక్కడి నుంచి నాలుగు కిలో మీటర్ల దూరంలో కొండ పేటు కింద వెలసిన ఉద్భవ లింగం కొండ లోపలి భాగంలో శివపార్వతుల విగ్రహాలు భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచాయి.

శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు వైఎస్సార్ జిల్లా నుంచే కాకుండా కర్నూలు,అనంతపురం, చిత్తూరు, నెల్లూరు,తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

రావణబ్రహ్మ వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రుడు



రావణ బ్రహ్మ వాహనంపై భద్రకాళీ సమేత వీరభద్రస్వామి

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లెలో వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరో రోజు బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి 10గంటల వరకూ, అనంతరం సాయంత్రం 5గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. ఈ క్రమంలో భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని రావణ బ్రహ్మ వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తుల నడుమ ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యుడు వీరనారాయణ యాదవ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుమంగళి పూజ



ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

రాయచోటి టౌన్ : శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అమ్మవారికి సుమంగళి పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి, కృష్ణయ్య స్వామి, శేఖర్ స్వామి, ఆలయ వేదపండితులు రాచరాయయోగి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపారు.

తొమ్మిది గడ్డి వాములు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని మైసూరారెడ్డి కాలనీలో సోమవారం తొమ్మిది గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన తొమ్మిది మంది రైతులు పశువుల కోసం వేసుకున్న గడ్డి వాములకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. సమాచారం అందుకున్న కడప, కమలాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఏటీఎం నమూనా సాగు.. రాబడి బాగు



నా పేరు గంగిరెడ్డి. మాది పెండ్లిమర్రి మండలం పగడాలపల్లె గ్రామం. నేను 20 సెంట్లలో ఏటీఎం నమూనాలో ఉల్లి, ముల్లంగి, క్యారెట్‌లతోపాటు గోంగూర, పాలకూర, చుక్కాకు, కొయిటాకు, కొత్తిమీరలను సాగు చేశాను. ఈ పంటల సాగుకు సేద్యం, విత్తనాల, కూలీలు అన్ని కలుపుకుని 5 వేలు ఖర్చు అయ్యింది. మేమే సొంతంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారు చేసుకుని వాడుకుంటాం. ప్రస్తుతం ఆకుకూరలతోపాటు ముల్లంగి కోతలు ప్రారంభమై రాబడి ఆరంభమైంది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు రాబడి వస్తుంది.



నా పేరు ముద్దనూరు షేక్ నుజహత్. ముద్దనూరు మండలం బొందలకుంట గ్రామం. నేను 20 సెంట్లలో ఏటీఎం నమూనాలో 18 రకాల కూరగాయలు, గడ్డ కూరలను సాగు చేశాను. వీటి సాగుకు రూ.4800 ఖర్చు అయింది. ఖరీఫ్ సీజనంతా నెలనెలా దిగుబడి వచ్చి డబ్బులు వచ్చాయి. నేను మా గ్రామంతో పాటు ముద్దనూరు టవున్‌లో వ్యాపారులకు కూరగాయలు, ఆకు కూరలు, గడ్డకూరలను సరఫరా చేశాను. అన్ని ఖర్చులు పోను నెలకు 8 వేల నుంచి 15 వేలదాకా ఆదాయం వచ్చింది.

- అంతర్ పంటల కూరగాయల సాగుతో నిత్యం రాబడి
- రోజువారి ఆర్థిక స్వావలంనే ధ్యేయంగా రైతుల అడుగులు
- ఏడాదంతా కాసులపంట.. ఆనందంలో అన్నదాతలు



పెండ్లిమర్రిలో చీనీ తోటలో సాగైన ఏటీఎం నమూనా కూరగాయలు



పెండ్లిమర్రిలో ఏటీఎం నమూనాలో సాగులో ఉన్న ఆకుకూరలు

కడప అగ్రికల్చర్ : వాతావరణంలో నెలకొన్న మార్పుల కారణంగా నేడు వేలకు వేలు ఖర్చు పెట్టి సాగు చేసిన పంటలు పండినా దిగుబడి సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట చేతికొచ్చే పరిస్థితి లేదు. ఉన్నట్లుండి అధిక వర్షాలు కురవడమో లేకుంటే అసలు వర్షాలే కురవకుండా పోవడమో జరుగుతుంది. దీంతో వేలకు వేలు ఖర్చు చేసి రైతన్నలు పంటలను సాగు చేయాలంటే వెన్నులో వణుకు పుడుతోంది. ఈ కారణంగా చాలా మంది రైతులు పంటలసాగుకు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. చాలా చోట్ల పంట భూములు బీడులుగా మారుతున్నాయి. అయితే ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు తక్కువ విస్తీర్ణంలో తక్కువ ఖర్చుతో పలు రకాల ఆకు కూరలు, కూరగాయలను సాగు చేసి ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. అందులోను ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం కషాయాలతో వీటిని సాగు చేస్తూ పండిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఏటీఎం(ఎనీ టైం మనీ) నమూనాలో భాగంగా ప్రతి 20 నుంచి 30 సెంట్లలో 25 రకాలకు పైగా కూరగాయలు, ఆకుకూరలతోపాటు తీగజాతి కాయ పంటలను సాగు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 180 ఏటీఎంలు సాగులో ఉన్నాయి.

జిల్లాలో పలు మండలాల్లో సాగైన ఏటీఎం నమూనా తోటల సంఖ్య	
కడప	28
ముద్దనూరు	13
మైదుకూరు	19
పోరుమామిళ్ల	38
పులివెందుల	50
ప్రొద్దుటూరు	09
బద్వేల్	12
కమలాపురం	11
మొత్తం	180

సాగు చేసిన 45 రోజుల నుంచే..

ఏటీఎం నమూనాలో సాగు చేసిన పలు రకాల కూరగాయలు, ఆకు కూరలు 45 రోజుల నుంచే దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. అనుదినం దిగుబడి సాధించేందుకు స్వల్పకాల పంటలు అయిన ఆకుకూరలు, దుంప పంటలలో ప్రతి నెలకు పంట వచ్చే ముల్లంగి, 2 నెలలకు పంట వచ్చే బీట్‌రూట్, 3 నెలల పంట వచ్చే క్యారెట్ విత్తనాలను వరుసగా ప్రతి నెలా దిగుబడి వచ్చేలా విత్తుకుంటారు. ఈ మూడు దుంపలను ఒకదాటి తరువాత ఒకటి విలీనం చేస్తూ ఒక దుంపను పండించే విస్తీర్ణంలోనే మిగిలిన రెండు దుంపల పంటలను వేసుకున్నారు. ఒకే పంట విస్తీర్ణంలో మూడు పంటలు పండించి మూడు రెట్లు దిగుబడి సాధిస్తున్నారు. దీంతోపాటు 30–40 రోజుల నుంచి దిగుబడి మొదలైన ప్రతి 3 రోజులకు ఒకసారి కోతకు వచ్చే గోరుచిక్కుడు, అలసంద పంటలను వేసుకున్నారు. ఈ పంట ప్రతి 70 రోజుల వ్యవధిలో రిలో సోయింగ్(ఇందులో ఒక పంటను పూర్తిగా కోసేందుకు కొంతకాలం ముందు మరో పంటను అదే భూమిలో విత్తడం జరుగుతుంది) ఈ అన్ని రకాల పంటలతోపాటు వంగ, టమాట, మిరప పంటల విత్తనాలను ప్రతి అడుగుకూ ఒక విత్తనం చొప్పున వేసుకోవాలి. ప్రధాన పంటల తరువాత రిలే పంటలుగా పంటల స్థలాలను మార్చుకుంటూ వెళ్లాలి. ఇలా 365 రోజుల పంటలను పండిస్తూ కాసులను పొందుతున్నారు. ఈ రకంగా జిల్లాలో ఏటీఎం నమూనాలో వేముల, వేంపల్లి, లింగాల, పెండ్లిమర్రిలతోపాటు పలు మండలాల్లో పలువురు రైతులు కూరగాయ పంటలను సాగు చేశారు.

ఏయే పంటలను సాగు చేస్తారంటే..

ఏటీఎం నమూనా కింద టమాట, వంగ, మటిక, మిరప, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్‌లతోపాటు గోంగూర, పాలకూర, మెంతాకు, కొత్తిమీర వంటి ఆకుకూరలు, తీగజాతి కూరగాయలైన బీర, కాకర, సొర, చిక్కుడు వంటి పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిలో కొన్ని కూరగాయలు సాగు చేసిన 25 నుంచి 30 రోజులకు కోతలు ప్రారంభమవుతాయి. మరి కొన్ని 45 రోజులకు, మరి కొన్ని 90 రోజులకు దిగుబడి వస్తుంది. ఇలా ఏడాదంతా కూరగాయలను పండించుకుంటూ డబ్బులను సంపాదిస్తున్నారు.

ఉన్న ఊరులోనే..

తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన కాయగూరలు, ఆకు కూరలను తాము ఉన్న గ్రామంలోనే మార్కెటింగ్ చేసుకునే అవకాశం ఉంటుంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా కిలో చొప్పున వినియోగదారులకు అందిస్తున్నారు. వీటితోపాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా కేవలం కషాయలు, జీవామృతం, ఘనామృతంతోనే పండించే కూరగాయలు కావడంతో ప్రజలు వీటిని తీసుకునేందుకు బాగా ఆసక్తి కనబరుస్తున్నారని పలువురు ఏటీఎం సాగు చేసిన రైతులు తెలిపారు.

చాలా ఆసక్తిగా సాగు చేస్తున్నారు..



ఏటీఎం నమూనాలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. తక్కువ విస్తీర్ణంలో సాగు కనుక సాగు ఖర్చు కూడా తక్కువగా ఉండటంతో చాలా మంది సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 180 ఏటీఎం నమూనాలను సాగు చేశారు. ఇంకా సాగు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారు. మేము కూడా ఆసక్తి ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం.

- ఎస్వీ ప్రవీణ్‌కుమార్, జిల్లా ప్రాజెక్టు అధికారి, ప్రకృతిసేద్యం

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

మదనపల్లె : ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ ఏరిసావలీ తెలిపారు. పుంగనూరు మండలం మేలుపట్ల గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు కొండప్ప(22) ద్విచక్రవాహనంలో గ్రామాలు తిరుగుతూ స్టీల్‌సామాన్లు విక్రయిస్తూ జీవించేవాడు. వ్యాపార అవసరాల కోసం పలువురి వద్ద లక్షకుపైగా అప్పు చేశాడు. ఈ క్రమంలో రుణం చెల్లించమంటూ ఒత్తిడి అధికం కావడంతో ఈనెల 12వ తేదీన మదనపల్లె పట్టణం బాకావానితోట సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడికి భార్య మారెమ్మ ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

మదనపల్లె : చింతచెట్టు విషయమై చెలరేగిన వివాదంతో జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని కొత్తవారిపల్లె గ్రామానికి చెందిన వేణుగోపాల్ ఈనెల 21వ తేదీన టమాటా పొలం వద్ద, చుట్టూ పేరుకున్న చెత్తను పోగు చేసి మంటపెట్టాడు. అయితే ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని పంట సాగు కోసం ఉంచిన కట్టెలు కాలిపోవడంతో పాటు, ఉమ్మడి ఆస్తిగా ఉన్న చింతచెట్టు కూడా మంటలు వ్యాపించడంతో కాలిపోయింది. ఈ విషయమై అతని తమ్ముడు హరి అన్నయిన వేణుగోపాల్‌తో గొడవపడ్డాడు. ఈ విషయం వేణుగోపాల్ తన భార్య విజయమ్మకు తెలియజేశాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈనెల 23వతేదీన విజయమ్మ పొలం వద్ద పనులు చేసుకుంటుండగా ఆమె మరిది హరి, అతని భార్య సునీత తమపైన పోలీసులకు ఫిర్యాదు చేస్తారా అంటూ విజయమ్మపై దాడి చేసి కొట్టారు. దాడిలో విజయమ్మ తలకు తీవ్ర గాయం కాగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

టెన్నిస్ బాల్ క్రికెట్‌లో ప్రతిభ

నందలూరు : రాష్ట్రస్థాయి 12వ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలో స్థానిక విభా ఎరుడైట్ స్కూల్ విద్యార్థిని వేపగుంట హనీ ప్రియాంక కడప జిల్లా బాలికల జట్టు తరపున ఆడి అత్యుత్తమ ప్రదర్శనతో జట్టు విజయానికి కృషి చేసింది. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగిన పోటీలో కడప జిల్లా బాలికల జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. వేపగుంట హనీ ప్రియాంక ప్రశంసాపత్రం, పతకాన్ని రాష్ట్ర స్థాయి అధికారుల చేతులమీదుగా అందుకుంది. ఈ సందర్భంగా విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయ భాస్కర్ రావు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ చొప్పా సుజాత రెడ్డి, ఫైనాన్స్ ఇన్‌చార్జి సుజాతమ్మ, కో–ఆర్డినేటర్ తుమ్మల అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



కురబలకోట మండలం, అంగళ్లుకు చెందిన ప్లాట్ల బాధితుల సమస్యలను వింటున్న జిల్లా ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి ఎస్పీ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారి వద్దకు ఎస్పీ నేరుగా వెళ్లి వారి సమస్యలను ఆలకించారు.

ప్లాట్ల ఆక్రమణపై..

కొనుగోలు చేసుకున్న ప్లాట్లను కొంతమంది నాయకులు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని 72 మంది బాధితులు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. కురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామంలో ప్లాట్ల యజమానులు అందరూ కలిసి ఎస్పీని కలిశారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి ఎస్పీ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

రాయచోటి జగదాంబసెంటర్ : పోలీసు కుటుంబాలకు ఎప్పటికీ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన దాసరి భాస్కర్ సతీమణి దాసరి సునందకు సోమవారం ఐడీఆర్ఎఫ్ ఫండ్ నుంచి మంజూరైన లక్ష రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి పోలీసు శాఖ తరపున వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏఓ బి.కృష్ణుడు, మృతుడి భార్య, పిల్లలు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్

మదనపల్లె : బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ)ని ఆంధ్రప్రదేశ్‌లో బలోపేతం చేసే దిశగా కృషి చేస్తానని రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ అన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారిగా మదనపల్లెకు వచ్చిన అయనకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, నాయకుల నుంచి ఘనస్వాగతం లభించింది. బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్.బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మాజ్యోతిబాపూలే, కాన్షీరామ్ సిద్ధాంతాల సాధనలో భాగంగా ఏర్పాటైన బహుజన సమాజ్‌పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు కృషిచేస్తానన్నారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కినప్పుడే ఆర్థిక, రాజకీయ, సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాలాజీ, గంగాధర్, శివ, మహేష్, ప్రశాంత్, హరి, కన్నయ్య, ఆనంద్, సారథి, రెడ్డెప్ప, రవితేజ, పెద్దసంఖ్యలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ

బి.కొత్తకోట : పశువుల దాణా బస్తాలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న సిమెంటు లారీ ఢీకొనడంతో ఆటో నుజ్జునుజ్జయిన ఘటన సోమవారం బి.కొత్తకోట సమీపంలోని టి.సదుం క్రాస్ వద్ద జరిగింది. బి.కొత్తకోటకు చెందిన ఆటో డ్రైవర్ షబ్బీర్ పెద్దతిప్పసముద్రం మండలం బూర్లపల్లికి పశువుల దాణా బస్తాలతో వెళ్తున్నాడు. క్రాస్ సమీపానికి రాగానే ములకలచెరువు వైపు నుంచి బి.కొత్తకోట వైపు వస్తున్న సిమెంటు లారీ ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది. పూర్తిగా ధ్వంసమై రోడ్డుపక్కన పడింది. ఆటో డ్రైవర్ షబ్బీర్‌కు గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు సంఘటన వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యమ్మ తల్లి ఆలయాన్ని పరిరక్షించండి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రామక్కపల్లి గ్రామస్తులు

రాజంపేట రూరల్ : గ్రామ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో కొలుచుకుంటున్న సత్యమ్మతల్లిని కబ్జా కోరల నుంచి కాపాడాలని రామక్కపల్లి గ్రామ ప్రజలు వేడుకున్నారు. పుల్లంపేట మండలం అప్పారాజుపేట పంచాయతీ రామక్కపల్లి గ్రామస్తులు సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని సర్వే నంబర్ 547లో ఉన్న గ్రామ కంఠాన్ని తిరుపతిలో నివాసం ఉంటున్న ఆకేపాటి రామచంద్రారెడ్డి కబ్జా చేశారన్నారు. ఇదే విషయంపై 2023లో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు సర్వే చేసి గ్రామ కంఠంకు సరిహద్దులు ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే ఈనెల 22వ తేదీన ఆ సరిహద్దులను రామచంద్రారెడ్డి దౌర్జన్యంగా తొలగించాడని వాపోయారు. అతనిపై చర్యలు తీసుకుని సత్యమ్మతల్లికి చెందిన పురాతన బావిని, గ్రామ కంఠాన్ని, సత్యమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణాన్ని పరిరక్షించాలని కోరారు.

వక్ఫ్ భూముల్లో ప్రవేశించిన ఐదుగురిపై కేసు నమోదు


మదనపల్లె : వక్ఫ్ భూములను, ప్రైవేట్ వ్యక్తులకు చెందినవిగా పేర్కొంటూ అందులోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై, జామియా మసీదు కేర్‌టేకర్ కమిటీ అధ్యక్షుడు పి.సర్దార్‌ఖాన్ ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మిట్టపల్లె శంకర్‌రెడ్డి, షరీఫ్, వెంకటరమణ నాయుడు, షబీనా, బాసిత్‌లపై బీఎన్ఎస్ 196(1), 329(3), 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 23న ఆదివారం ఉదయం 11.45 నిమిషాలకు కదిరి రోడ్డులోని జామియా మసీదు వక్ఫ్‌బోర్డు భూముల్లోకి ఐదుగురు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించినట్లు పేర్కొన్నారు. ముస్లిం సమాజంలో ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించేందుకు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 బస్టాండ్ వద్ద సోమవారం కారు– ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చాముండేశ్వరి పేటకు చెందిన ఆటో కడప నుంచి మాధవరం–1 గ్రామానికి వెళుతోంది. రాజంపేట వైపు నుంచి కడపకు కారు వెళుతుండగా మాధవరం–1 బస్టాండ్ వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్‌కేఆర్ నగర్‌కు చెందిన మామిళ్ల క్రిష్ణయ్యకు గాయాలయ్యాయి.

కసాయి మనవడు

- వృద్ధురాలిని ఇంటి నుంచి వెళ్లగొట్టిన వైనం
- న్యాయం కోసం ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు



తన గోడును చెప్పుకుంటున్న బాధితురాలు రామలక్షుమ్మ

వీరబల్లి : తన కూతురు బిడ్డే కదా అని చేరదీసి ఇంట్లో పెట్టుకొని చదివించిన అమ్మమ్మను ఆ మనవడే కనికరం లేకుండా ఇంట్లోనుంచి తన్ని తరిమేసిన కర్కశ ఉదంతమది. ఆ మనవడికి అతని తండ్రి కూడా తజత కలిసి వృద్ధురాలిని బయటకు నెట్టేసి ఏకంగా ఇంటికి తాళాలు వేసుకుని మరో ఊరికి మకాం మార్చారు. దీంతో దిక్కు తోచని స్థితిలో బాధితురాలు సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీకి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వీరబల్లి మండలం మట్లి పంచాయతీ పెద్దూరుకు చెందిన వడ్లమూడి రామలక్షుమ్మకు ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో ఇద్దరు కూతుళ్లు, కుమారుడు మరణించారు. మిగిలిన ముగ్గురు కూతుళ్లలో రెండవ కుమార్తె సులోచన కుమారుడు సోమినేని సునీల్ కుమార్‌ను రామలక్షుమ్మ, ఆమె భర్త వెంకటరమణ చేరదీసి చదివించారు. కొద్ది రోజులకు వెంకటరమణ మరణించాడు. అప్పటి నుంచి మనవడు సునీల్ కుమార్, అతని తండ్రి వెంకటరత్నంలు రామలక్షుమ్మను వేధించడం మొదలు పెట్టారు. ఈ ఇల్లు, భూములు మావి, నీకు ఎలాంటి హక్కు లేదంటూ వాటిని తమ హస్తగతం చేసుకుని పలుమార్లు ఆమెపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. అప్పట్లో కూడా జిల్లా ఎస్పీకి ఆమె ఫిర్యాదు చేసింది. అయినా వారిలో ఏమాత్రం మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల ఏకంగా తండ్రీ, కొడుకులు ఆమెను బయటకు నెట్టేసి ఇంటికి తాళాలు వేసుకొని మరో ఊరికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి బాధితురాలు అదే ఊరిలో ఉన్న తన తమ్ముడి ఇంట్లో తల దాచుకుంటోంది. తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

కుంభమేళాకు వెళ్లి వస్తూ గుండెపోటుతో మృతి



నూకాపాపుగారి సుధాకర్‌రెడ్డి (ఫైల్)

ఓబులవారిపల్లె : ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం అయోధ్యలో గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడు నూకా పాపుగారి సుధాకర్ రెడ్డి (47) మృతి చెందాడు. ఇటీవలే నూకా పాపుగారి సుధాకర్ రెడ్డి కువైట్ నుంచి మహా కుంభమేళాకు వెళ్లేందుకు స్నేహితులతో కలిసి స్వదేశానికి వచ్చాడు. కుంభమేళాకు వెళ్లి అక్కడి నుంచి అయోధ్య శ్రీరాముని దర్శనం కోసం వేచి ఉండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా గుండెపోటు రావడంతో ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల కేంద్రంలో కులమతాలకు అతీతంగా దశాబ్దాలుగా నిర్వహించే పీర్లపండుగను ప్రతి ఏడాది ఆయన ఆధ్వర్యంలో నిర్వహించేవారు. ఇటీవల నూతనంగా సొంత నిధులతో పీర్ల చావిడిని కూడా నిర్మించారు. అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ మంచిపేరు తెచ్చుకున్న సుధాకర్ రెడ్డి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నా రు. మంగళవారం మృతదేహం మండల కేంద్రానికి చేరుకుంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని 108 అంబులెన్స్ ఉద్యోగులకు 2024 సంవత్సరం నవంబర్ 26వ తేదీన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ యాదవ్, బి.వి.చలపతి మాట్లాడుతూ వాహన సిబ్బందికి కనీస వసతులతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. నిరసన కార్యక్రమంలో 108 ఉద్యోగులు పాల్గొన్నారు.